సాక్షి గుంటూరు

శనివారం । 31 । ఆగస్టు । 2024



కోదండరాముడికి పూజలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని కోదండ రామాలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.



వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

దాచేపల్లి: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేసి సారె సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 6034 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 170 క్యూసెక్కులు వదిలారు.



ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

కోల్‌కతా మెడికల్ కళాశాలలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో నిందితులు తప్పించుకోకుండా కఠినంగా శిక్షించాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి. విచారణ త్వరగా పూర్తి చేసి నిందితుల్ని వెంటనే కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు పోలీసుల రక్షణ కల్పించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. దీనికి ఐఎంఏ బాధ్యత తీసుకోవాలి.

-డాక్టర్ సాయి శ్రీజ, సీనియర్ రెసిడెంట్, ఎయిమ్స్ మంగళగిరి






వైద్యులకు రక్షణ కరువు

ఎంతో కష్టపడి వైద్య విద్య పూర్తి చేసి రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు నేడు సమాజంలో రక్షణ కరువైంది. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ, నిందితుడిపై చర్యలు తీసుకోకపోవడం దారుణం.ఇటీవల తిరుపతిలో జూనియర్ డాక్టర్‌పై రోగి బంధువులు దాడి చేయడం అమానుషం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని, మహిళలకు భరోసా కల్పించాలి.

- డాక్టర్ పూజ, ఎయిమ్స్

న్యూస్‌రీల్

భ్రమరాంబకు లక్ష గాజులతో ప్రత్యేక అలంకరణ



పెదకాకాని: శ్రావణ మాస చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో సామూహిక వరలక్ష్మి వ్రతాల్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గుంటూరు-2 నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి వ్రతంలో పాల్గొన్నారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారిని లక్ష గాజులతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించినట్లు ఈవో డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. వ్రతంలో పాల్గొన్న ముత్తయిదువులకు దేవస్థానం పసుపు కుంకుమ, జాకెట్ ముక్క, అష్టలక్ష్మి దేవి రూపు, కంకణాన్ని అమ్మవారి ప్రసాదంగా అందజేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



మంగళగిరి: పట్టణంలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణ శుక్రవారం సందర్భంగా వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. పూజ సామగ్రిని ఆలయం ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమాన్ని ఈవో ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. పట్టణంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులోని శ్రీ కాళికామాత ఆలయం, పాత మంగళగిరి బైపాస్ రోడ్డులోని కనకదుర్గ ఆలయం, కోర్టు ఎదుట అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: జిల్లావ్యాప్తంగా శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా 17 మండలాలు, గుంటూరు కార్పొరేషన్‌తో పాటు నాలుగు పట్టణాలలోని 2,56,890 మందికి రూ.109.39కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఆగస్టు 31నే పంపిణీ చేయాలని ఆదేశించిందని తెలిపారు. ఆ రోజు తీసుకోని వారికి రెండో తేదీన ఇస్తామని వెల్లడించారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి శుక్రవారం పలువురు భక్తులు విరాళాలను ఇచ్చారు. గుంటూరు బ్రాడీపేటకు చెందిన దాసరి కస్తూరి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. ఆలయ ఈవో కె.ఎస్.రామారావును కలిసి రూ.5 లక్షలను అందజేసింది. విజయవాడ కొత్తపేటకు చెందిన చక్రాతి చెన్నకేశవరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఈవో కె.ఎస్.రామారావు, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఉగ్ర కృష్ణవేణి

- ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ
- 70 గేట్లు ఎత్తివేత
- ఆగిన ఇసుక రవాణా
- గుంటూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- అల్పపీడన ప్రభావంతో ఎడతెగని వాన
- రెండురోజుల్లో వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- సెప్టెంబర్ 2 వరకు కోస్తాంధ్రలో భారీ వర్షాలు



సీతానగరం రైల్వే బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకూ ఆగకుండా జల్లులు పడుతూనే ఉన్నాయి. అల్పపీడనం వాయుగుండంగా మారడం వల్ల వచ్చే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా వర్షం పడతుండటంతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కృష్ణానదికి భారీ వరద వస్తుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 37.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 3.2 మిల్లీ మీటర్లు పడింది. సగటున 12.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

భారీగా నీటి విడుదల

కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద నీటి కారణంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు, పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా నీటి విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 12 క్రస్ట్ గేట్ల నుంచి 3లక్షల క్యూసెక్కులు దిగువకు వదలుతున్నారు. ఎగువ నుంచి 2,71,898 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 38.84 టీఎంసీలు ఉంది. పై నుంచి భారీగా వరద నీరు వస్తున్నందున ప్రకాశం బ్యారేజీ నుంచి సుమారు 3.35 లక్షల క్యూసెక్కుల్ని సముద్రంలోకి వదులుతున్నారు. మొత్తం 70 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి వస్తున్న వరద నీటిని దృష్టిలో పెట్టుకుని నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండల అధికారులను అప్రమత్తం చేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం నంబర్ 0863-2234014ను ఏర్పాటు చేశారు. విపత్కర పరిస్థితి ఏర్పడితే ప్రజలు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

నగరపాలక సంస్థలో 24/7 కాల్ సెంటర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే తక్షణ స్పందన కోసం కలెక్టర్ ఆదేశాలు మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 24/7 పని చేసేలా ప్రత్యేక కాల్ సెంటర్‌ని ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచినా, తాగునీటి సరఫరాలో సమస్య ఎదురైనా వెంటనే 0863-2345105 నంబర్‌కి లేదా 98499 08391కు వాట్సాప్ చేయవచ్చని సూచించారు.



తాడికొండ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నది

స్టాక్ పాయింట్లలో నిలిచిన ఇసుక సరఫరా



వరద నీటితో మునిగిన ఇసుక స్టాక్ పాయింట్

తాడికొండ: ఎగువ కృష్ణా నదికి వరద నీరు పోటెత్తింది. నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని భారీగా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో తుళ్లూరు మండలంలోని నదీ పరివాహక ప్రాంతంలో భారీగా వరద నీరు చేరింది. ప్రభుత్వం ఇసుక సరఫరా కోసం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లు పూర్తిగా నీట మునిగాయి. లింగాయపాలెం స్టాక్ పాయింట్‌కు వెళ్లే రహదారి పూర్తిగా మునిగిపోగా, తాళాయపాలెంరీచ్ బురదమయంగా మారింది. వాహనాలు ఇరుక్కు పోతుండటంతో సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.గంగరాజు శుక్రవారం స్థానిక తహసీల్దారు సుజాతతో కలిసి స్టాక్ పాయింట్లు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. వరద ప్రవాహం పూర్తిగా తగ్గి, రోడ్లు సరిచేసే వరకు ఇసుక లోడింగ్ ఉండదని తెలిపారు. ఇసుక లారీలు, ట్రాక్టర్లను ట్రాఫిక్ లేని ప్రాంతాల్లో నిలుపుకోవాలని డ్రైవర్లకు సూచించారు. ఇసుక లోడింగ్ జరిగే సమయాన్ని తిరిగి తెలియజేస్తామని చెప్పారు.

లంబోదరుడికి రంగుల నగిషీ



భారీ గణపతి విగ్రహానికి రంగుల అద్దకం

- చవితికి ముస్తాబవుతున్న భారీ గణపతి
- 27వ వార్షిక వేడుకలకు సన్నాహాలు

తెనాలి: వినాయక చవితి వేడుకకు తెనాలిలోని భారీ గణపతిని ముస్తాబు చేస్తున్నారు. విజయవాడ రోడ్డులోని ఊరి పొలిమేరల్లో 59.5 అడుగుల ఈ భారీ వినాయక విగ్రహం 27వ వార్షిక చవితి వేడుకలకు రంగులతో ముస్తాబు చేస్తున్నారు. నిర్వాహకులు పండుగ సన్నాహాల్లో ఉన్నారు. మూడురోజులపాటు జరిగే చవితి పూజల్లో పండుగ రోజున 7వేల నుంచి 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.

ముగ్గురు మిత్రుల ఆలోచన

పట్టణానికి చెందిన స్నేహితులు కోటా శ్రీనివాస్, అమిరినేని రాజా, కొణిజేటి గోపీకృష్ణల ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో పౌల్ట్రీలకు కోళ్ల దాణాను సరఫరా చేసే వ్యాపారంలో ఉన్న ఈ మిత్రులు, వ్యాపార నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లినపుడు ఈ ఆలోచన వచ్చింది. దాదాపు ప్రతి గ్రామంలోనూ ఊరి వెలుపల ఆంజనేయస్వామి విగ్రహం ఉండటాన్ని గమనించారు. తిరిగొచ్చాక శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయరుస్వామిని కలిశారు. తమ ఆలోచనను వివరించారు. ఎంతగానో సంతోషించిన ఆయన 'ఊరిబయట వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించండి...ఊరికి మంచి జరుగుతుంది' అని సలహానిచ్చారు. దీంతో తగిన ప్రదేశాన్ని ఎంచుకున్నారు. విజయవాడ రోడ్డులో తెనాలి సరిహద్దులో ఇరిగేషన్ కాల్వ పక్కనే ఎంచుకున్న స్థలంలో విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించారు. తణుకు సమీపంలోని చేబ్రోలుకు చెందిన సాయి విగ్రహశాల శిల్పి సాయిబాబు ఇక్కడే ఏడాదిన్నర కాలం ఉండి విగ్రహాన్ని రూపొందించారు. చినజీయర్‌స్వామి స్వయంగా వచ్చి భూమిపూజ చేశారు. 1997 అక్టోబరు 17న తిరిగి చినజీయరుస్వామి చేతులమీదుగానే విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయనే తొలిపూజ చేశారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు

విగ్రహం 59.5 అడుగుల ఎత్తులో ఉంటుంది. వినాయకుడి పీఠం కమలం తరహాలో 11 అడుగుల ఎత్తులో ఉంటుంది. కిరీటం 13 అడుగులు, స్వామివారి హస్తం, పాదం ఒక్కోటీ ఆరు అడుగుల పొడవునా తీర్చిదిద్దారు. ఏటా వినాయకచవితికి విగ్రహానికి రంగులు వేయించి, మూడు రోజులపాటు ఉత్సవాలను జరుపుతూ వస్తున్నారు. మరో చిన్న విగ్రహాన్ని పూజల్లో ఉంచి, తర్వాత నిమజ్జనం చేస్తున్నారు. మిగిలిన రోజుల్లోనూ ఉదయం, సాయంత్రం ఇక్కడ అర్చకుడు అందుబాటులో ఉండి పూజలు చేస్తున్నారు.

భక్తుల ఆదరణ పెరిగింది



చవితి రోజున భారీ గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. భక్తిప్రవత్తులతో దర్శించుకుని మొక్కుకుంటున్నారు. ప్రతి ఏటా స్వామివారిని రంగులతో ముస్తాబు చేయటం తప్పనిసరి. చవితిరోజున ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– కొణిజేటి గోపీకృష్ణ, ఆలయ నిర్వాహకుడు

కుమారుడి మరణ వార్తతో ఆగిన తల్లి గుండె

గుంటూరులో విషాదకర సంఘటన



అంకమ్మరావు (ఫైల్)



దుర్గ మృతదేహం

పట్నంబజారు: కొడుకు మృతువాత పడ్డాడని తెలిసిన ఆ తల్లి గుండె తల్లడిల్లిపోయింది.. దుర్వార్త విని భరించలేక వెక్కివెక్కి ఏడ్చి ఆఖరికి ఆగిపోయింది. ఈ హృదయ విషాదకర సంఘటన గుంటూరు నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచాల అంకమ్మరావు (36) ఈ నెల 29న శుభకార్యం నిమిత్తం వెళుతూ, కాటూరి మెడికల్ కళాశాల వద్ద జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందాడు. అతడు భార్య లక్ష్మి, తల్లి దుర్గ (60)తో కలిసి శ్రీనివాసరావుపేటలోనే ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకునే ఆ పేదింట, అనుకోని ఘటన విషాద ఛాయలు మిగిల్చింది. కన్న కొడుకు కారు ప్రమాదంలో మృతి చెందాడని తెలుసుకున్న తల్లి దుర్గ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది. బంధువులు ఆమెను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ దుర్గ 30వ తేదీ తెల్లవారుజామున మృతి చెందింది. ఒకే ఇంట్లో రెండు విషాదకర సంఘటనలు జరగడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. దుర్గకు మృతి చెందిన అంకమ్మరావు పెద్ద కుమారుడు కాగా, రెండో కుమారుడు నాగూల్ మస్తాన్ ఉన్నారు.

మరణించినా 'చూపు'న్న జీవితం

- నేత్రదానంపై ప్రజల్లో అపోహలు, మూఢ నమ్మకాలు
- చనిపోయిన తర్వాత మట్టిపాలు
- ఒకరి నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు
- ప్రజలకు అవగాహన కల్పిస్తూ పక్షోత్సవాలు నిర్వహణ



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి గుంటూరు వెంగయ్య నగర్‌కు చెందిన వేముల నాగేశ్వరరావు (60). కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ జూలైలో గుంటూరు జీజీహెచ్‌లో చనిపోయాడు. బాధలో ఉండి కూడా ఆయన కుమారుడు ప్రసాద్ తండ్రి నేత్రాలు దానం చేశారు. నాగేశ్వరరావు నేత్రదానంతో వైద్యులు ఇద్దరికి చూపును ప్రసాదించారు.



గుంటూరు మెడికల్: శరీరంలో ఏ అవయవ లోపం ఉన్నా జీవితాన్ని నెట్టుకు రావచ్చునేమో గానీ కళ్లు లేకపోతే అంధకారమవుతుంది. అందుకే 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. దేశంలో వివిధ కారణాలతో కంటిలోని నల్లగుడ్డు దెబ్బతినడం వల్ల కోటి పది లక్షల మంది అంధులుగా మారారు. వీరిలో నల్లగుడ్డు పొర అంధత్వంతో 12 లక్షల మంది బాధపడుతున్నారు. అందులో ఎనిమిది లక్షల మంది చిన్న పిల్లలు కావడం బాధాకరం. దేశంలో ఏటా 95లక్షల మంది వివిధ కారణాలతో మరణిస్తున్నారు. కానీ వీరిలో కార్నియా సేకరణ 20వేలు నుంచి 30 వేలు మాత్రమే ఉంది. నేత్రదానంపై అవగాహన లోపం వల్లే సేకరణ జరగం లేదు. అందమైన ప్రపంచాన్ని చూడాలంటే చూపు సక్రమంగా ఉండాలి. అంతటి ప్రాముఖ్యత ఉన్న నేత్రాల్ని సంరక్షించుకోవడం, అంధత్వాన్ని నియంత్రించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని సూచిస్తూ జిల్లాలో ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వరకు 39వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మూఢ నమ్మకాలతో ముందుకు రాని ప్రజలు

రోడ్డు ప్రమాదాల్లో, తీవ్ర అనారోగ్యాలతో ప్రతిరోజూ ఎంతో మంది చనిపోతున్నారు. ఇందులో ఒక వ్యక్తి నేత్రదానంతో అంధులైన ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. నేత్రదానం ద్వారా వ్యక్తి మరణించినా అతని కళ్లు జీవించే ఉంటాయి. వేరొకరి ద్వారా ప్రపంచాన్ని చూస్తూనే ఉంటాడు. అంధులకు కార్నియా ఆపరేషన్లు చేయడం ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చు. చనిపోయిన వ్యక్తుల్ని దహనం లేదా పూడ్చి పెట్టడం చేస్తున్నారు. ప్రజలకు అవగాహన లేకపోవడం, మూఢ నమ్మకాల వల్ల నేత్రదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు.

ఆరు గంటల్లోగా కార్నియా సేకరించాలి

వ్యక్తి మరణించిన ఆరు గంటలలోపు నేత్రాలను సేకరించాలి. వ్యక్తి మరణించాకా అతడిని ఉంచిన గదిలో ఫ్యాన్‌లు తక్షణమే ఆపివేయాలి. కళ్లు మూయాలి. చల్లదనం ఉండే ప్రదేశంలో లేదా ఏసీ బాక్స్‌లో భౌతిక కాయాన్ని భద్రం చేసి నేత్ర వైద్యులకు సమాచారం అందజేయాలి. హెచ్ఐవీ, ఎయిడ్స్, హెచ్‌బీఎస్‌ఏ లాంటి దీర్ఘకాల రోగాలు ఉన్నవారి నేత్రాలు పనికిరావు. పచ్చకామెర్లు, కుక్కకాటు ద్వారా మరణించినవారు, బ్లడ్ క్యాన్సర్‌తో మరణించిన వారి నేత్రాలు పనికిరావు. రెండేళ్ల మొదలుకొని 80 ఏళ్ల వయస్సు వారి నేత్రాలు దానం చేసేందుకు పనికొస్తాయి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



జీజీహెచ్‌లో కార్నియాలు సేకరించి అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నాం. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అంధత్వానికి గురికాకుండా కాపాడవచ్చు. షుగర్ వ్యాధిగ్రస్తులు ముందస్తుగా పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలి.బీపీ, షుగర్ ఉన్నా నేత్ర దానం చేయవచ్చు.చనిపోయిన వ్యక్తి బంధువులు, కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు సమాచారం ఇస్తే వైద్యులు వచ్చి కళ్లను సేకరిస్తారు.

– డాక్టర్ జి. రవిబాబు, కంటి వైద్య విభాగాధిపతి

అంధత్వ నివారణకు కృషి



చనిపోయినవారి నేత్రాలను (కార్నియా) సేకరించి అంధులకు అమర్చి చూపును ఇవ్వొచ్చు. జిల్లాలో గుంటూరు జీజీహెచ్, గుంటూరు సుదర్శిని కంటి ఆస్పత్రి, పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో కార్నియా సేకరణ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా జిల్లాలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. అంధత్వ నివారణ సదస్సులు నిర్వహించి, అనేక మంది నుండి నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలను తీసుకున్నాం.

డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ

7,475 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



జిల్లాలో 2024-25 సంవత్సరానికి 11,515 కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు 7,475కి ఆపరేషన్లు ఉచితంగా చేశాం. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 36,411 మంది విద్యార్థులు దృష్టిలోపంతో బాధపడుతున్నారని స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ద్వారా పరీక్షలు చేసి నిర్ధారించాం. మా సంస్థ ద్వారా 3,798 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశాం.

–డాక్టర్ చుక్కా రత్నమన్‌మోహన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం: రూ.7,000 గరిష్ఠం: రూ.9,200

మోడల్ ధర రూ.8,400

క్లుప్తంగా

బస్సులను ఇతర అవసరాలకు వాడకూడదు

డీటీసీ షేక్ కరీం



నెహ్రూనగర్: విద్యా సంస్థల బస్సులను కేవలం స్కూల్, కాలేజీ విద్యార్థుల రవాణా కోసమే వాడాలని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యాలతో శుక్రవారం ప్రత్యేక సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారంగా వాహనాలను ఇతర కార్యక్రమాలకు వాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అటువంటి వాహనాలపై కేసులు నమోదు చేసి కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులకు వర్తించే ట్యాక్సులు వసూలు చేస్తామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా తిరిగే బస్సులను సీజ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీఓ గోపాల్, ఎంవీఐలు మల్లీశ్వరి, గంగాధర్, ప్రసాద్, సౌజన్య పాల్గొన్నారు.

రేపు సత్తెనపల్లిలో ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ పల్నాడు జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం ఫొటోస్టాట్ (ఫారం-5) రెండు కాపీలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాతో పాటు పలుచోట్ల మహిళలపై దాడులు దారుణం. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకువచ్చి నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు అండగా నిలవాలి. నిందితులను కఠినంగా శిక్షించినప్పుడే మహిళలు ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వహించగలరు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లోనూ వైద్యులకు రక్షణ కరువైంది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడుల్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి.

డాక్టర్ మానవి, ఎయిమ్స్



వైద్యులకు వసతులు కల్పించాలి..



జీజీహెచ్‌లో నైట్ డ్యూటీ చేసే వైద్యులకు వసతులు కల్పించాలి. రోగులకు వైద్యం అందించే సమయంలో వారి సహాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటివి నిరోధించేందుకు ఆస్పత్రుల్లో నిరంతరం పోలీసులు సిద్ధంగా ఉండాలి. అవుట్ పోస్ట్ పోలీసులు కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా దాడులు నిరోధించేందుకు కృషి చేయాలి. ఆస్పత్రిలో పనిచేసే వైద్యులకు రక్షణ పెంచాలి. ఆస్పత్రిలో సెక్యూరిటీ పటిష్టం చేయాలి.

– డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, ఆర్థోపెడిక్

సతత హరితం ధ్యేయం





పేరేచర్ల నగర వనంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

మేడికొండూరు: వనం – మనం మహోత్సవాన్ని మండలంలోని పేరేచర్ల నగర వనంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ హాజరై, మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం చాలా ముఖ్యమన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. విద్యార్థులకు మొక్కల నాటడం వల్ల జరిగే ప్రయోజాలపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ స్వప్నిక్, డీఆర్‌డీఏ పీడీ సుజాత, ఫారెస్ట్ అధికారి పోతురాజు, మండల స్పెషల్ ఆఫీసర్ వీరాచారి, జేడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, తహసీల్దారు పద్మనాభుడు, ఎంపీడీవో ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ డి.రాజ్‌కుమార్, జిల్లా, మండల స్థాయి అధికారులు, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జేసీ భార్గవ్ తేజ



మొక్కలు నాటుతున్న మంత్రి నాదెండ్ల

భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని ఇవ్వాలి

తెనాలి రూరల్: భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి మండలం ఎరుకులపూలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు, అధికారులు, స్కూలు విద్యార్థులతో కలిసి గ్రామంలోని పలు ప్రాంతాలతో పాటు ప్రాథమిక పాఠశాల ఆవరణలో వేప మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వాలకే కాకుండా ప్రజలు కూడా భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. తెనాలిలో యుద్ధప్రాతిపదికన 10 వేల మొక్కలు నాటనున్నట్లు మంత్రి మనోహర్ తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపులేటి సామ్రాజ్యం, మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు శ్రావణ సారె



భట్టిప్రోలు: భట్టిప్రోలు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ సారె మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌కు 108 చీరలతో అలంకారం చేశారు. ఉదయం అమ్మవారి చెట్టు నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. పెండ్లికుల గోత్రికులు మొదటి సారె సమర్పించారు. పలు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని నేత్రపర్వంగా అలంకరించారు.

విజయకీలాద్రిపై శ్రావణ శుక్రవారం పూజలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మీ అమ్మవార్ల తిరుమంజన సేవ, అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, అష్టైశ్వర ప్రాప్తికి శ్రీ సూక్త హవనం కార్యక్రమాల్ని అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం సహస్ర బిల్వార్చన, కదంబ పుష్పాలంకరణ, నివేదన, నక్షత్ర హారతి కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అష్టలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురానికి చెందిన డి. వెంకట రత్నకుమారి(45) స్కూల్ అసిస్టెంట్‌గా నాదెండ్ల మండలం తూబాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్నారు. పాఠశాల అయిన తరువాత స్కూటీపై తిరిగి ఫిరంగిపురం వస్తున్నారు. నుదురుపాడు గ్రామ శివారులో నరసరావుపేట నుంచి గుంటూరు వెళుతున్న కారు వెనక నుంచి వెంకటరత్నకుమారి స్కూటీని ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ రవీంద్రబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతిరాలికి భర్త, కుమార్తె ఉన్నారు.

కాలువలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



కొల్లూరు: అనారోగ్య సమస్యల కారణంగా ఓ వృద్ధురాలు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన చొప్పర కరుణ (73) కొద్ది రోజుల క్రితం పక్షవాతానికి గురైంది. ఆమె భర్త గతంలోనే మరణించారు. ఇద్దరు కుమార్తెల్లో ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు దుబాయిలో ఉంటున్నారు. వీరిలో ఒకరు ఇటీవల కొల్లూరులో ఉంటున్న కరుణ సోదరి మేరీకుమారికి నగదు పంపారు. దాంతో వైద్యం చేయించాలని కోరడంతో తెనాలి వైద్యశాలలో చికిత్స చేయించారు. తర్వాత కొల్లూరుకు తీసుకొచ్చారు. ఇటీవల మేరీ కుమారి కిందపడి చేతికి గాయం కావడంతో తెనాలిలో చికిత్స పొందుతున్నారు. కరుణ ఒంటరిగా ఇంట్లో ఉంటోంది. మూడు రోజుల క్రితం పక్కింటి వద్ద కూర్చున్న ఆమె ఆ సాయంత్రం నుంచి అదృశ్యమైంది. ఇరుగుపొరుగు వారు, బంధువులు వెతకగా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం వారి ఇంటి సమీపంలో ప్రవహించే దోనేపూడి పంట కాలువలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐలు అర్జున్, వెంకటేశ్వరరావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆమెది ఆత్మహత్యగా భావిస్తూ మేరీ కుమారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కొల్లిపరలో అత్యధికంగా 37.2 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 37.2 మి.మీ. అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 3.2 మి.మీ. పడింది. సగటున 12.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. దుగ్గిరాల మండలంలో 27.4 మి.మీ., తెనాలి 17.4, తాడేపల్లి 16.8, మంగళగిరి 15.6, పెదనందిపాడు 13.4, కాకుమాను 11.4, పొన్నూరు 11.4, తాడికొండ 10.4, ప్రత్తిపాడు 10.2, చేబ్రోలు 9, ఫిరంగిపురం 8.8, తుళ్లూరు 8.6, గుంటూరు తూర్పు 8.4, పెదకాకాని 8.2, గుంటూరు పశ్చిమ 7.2, వట్టిచెరుకూరు మండలంలో 5.2 మి.మీ. చొప్పున వర్షం పడింది.

యార్డులో 51,315 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 44,587 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 51,315 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,619 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నడిరోడ్డుపై కారు దగ్ధం



కొల్లూరు: ప్రయాణిస్తున్న కారులో ఉన్నట్టుండి దట్టమైన పొగలు వ్యాపించి మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కారు యజమాని కథనం మేరకు... వేమూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన పాముల అనిల్ తన చిన్నారి కుమార్తె, మరో యువకుడితో కొల్లూరుకు కారులో పయనమయ్యారు. మండలంలోని మొసలిపాడు దాటిన అనంతరం తెనాలి-రేపల్లె ప్రధాన రహదారిపై క్రాప-రావికంపాడు అడ్డరోడ్డు సమీపంలోకి వచ్చారు. అదే సమయంలో ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి కారు మొత్తం వ్యాపిస్తుండటంతో అప్రమత్తం అయ్యారు. వెంటనే కారును నిలిపేశారు. యువకుడితో కలిసి ఇంజిన్‌ను పరిశీలించేందుకు ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కారులోని కుమార్తెను బయటకు దింపే సమయానికే మొత్తం మంటలు వ్యాపించాయి. అటుగా వస్తున్న వారు మంటలను అదుపు చేసేందుకు సమీపంలో ఉన్న ఇంటిలో నుంచి బకెట్‌తో నీళ్లు పోసినప్పటికీ కారు మొత్తం అగ్నికి ఆహుతైంది. వాహనాల రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి.

సరైన పత్రాలు లేకపోతే వాహనాలు సీజ్

అదనపు ఎస్పీ శ్రీనివాసరావు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న శ్రీనివాసరావు

తాడేపల్లి రూరల్: సరైన పత్రాలు లేని వాహనాల్ని సీజ్ చేస్తామని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం, మహానాడులో తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 100 మంది సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వంద వాహనాల వరకు సరైన పత్రాలు లేనట్లు గుర్తించి యజమానులను అక్కడకు పిలిపించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మహానాడులో రహదారులన్నీ బారికేడ్లతో మూసివేసి కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇప్పుడు తనిఖీ చేసిన వాహనాలు మరలా పట్టుబడితే వాటిని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా సస్పెక్ట్ షీటర్స్, రౌడీ షీటర్స్ వివరాల సేకరణతో పాటు వారి ప్రస్తుత కదలికలు ప్రజల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నేరాలు చేసి ఇక్కడ తలదాచుకుంటున్నారా? అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, మంగళగిరి సీఐ వినోద్ కుమార్, తాడేపల్లి యస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూపీఎస్‌కు వ్యతిరేకంగా యూటీఎఫ్ నిరసన



డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను అంగీకరించేది లేదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు అన్నారు. బ్రాడీపేటలోని తాలూకా ప్రాంగణంలో శుక్రవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ యూపీఎస్ సైతం జీపీఎస్ కోవలోకే వస్తుంది తప్పా, ఉద్యోగులకు మేలు చేసేది కాదని అన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ పెన్షన్ హక్కుపై సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వాలు సైతం తుంగలో తొక్కుతున్నాయని అన్నారు. పాత పెన్షన్ సాధించేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యూటీఎఫ్ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. యూపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, జిల్లా సీపీఎస్ కమిటీ కన్వీనర్ సీహెచ్. ఆదినారాయణ, కో–కన్వీనర్ ఎండీ షకీలా బేగం, జిల్లా కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, ఎం. గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు కె.ప్రభూజీ, కె. ప్రేమ్‌కుమార్, నాగమణి, బెల్లంకొండ ప్రసాద్, బాజీబాబా, గోపయ్య, బురాన్, ఆదాం సాహెబ్, అంకమ్మరావు పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన వీఐటీ ఫౌండర్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న విశ్వనాథన్

తాడికొండ: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి పొంగూరు నారాయణను శుక్రవారం వీఐటీ ఫౌండర్ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యనందించేందుకు తమ వర్సిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వీసీ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీస్ చంద్ర ముదిగంటి ఉన్నారు.

బాలుడి కడుపు నుంచి గుండు సూది తొలగింపు



బాలుడితో డాక్టర్ నాగూర్‌బాషా, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: ఆటలాడుతూ గుండు సూదిని మింగిన ఐదేళ్ల బాలుడి కడుపు నుంచి నిమిషాల వ్యవధిలో గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులు బయటకు తీసి రక్షించారు. గుంటూరులోని సంగడిగుంటకు చెందిన ఐదేళ్ల షేక్ సోహెల్ శుక్రవారం ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో గుండు సూదిని మింగాడు. అది అన్నవాహికలో ఇరుక్కుపోయింది. తోటి పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భయంతో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం వచ్చారు. క్యాజువాలిటీ వైద్యులు తక్షణమే గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులకు సమాచారం అందించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా, పీజీ వైద్యులు అనిల్ కుమార్ వివిధ పరీక్షలు చేసి ఎండోస్కోపి ద్వారా నిమిషాల వ్యవధిలో గుండు సూదిని తొలగించి బాలుడు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లకుండా కాపాడారు. ఏ మాత్రం ఆలస్యం చేసిన పేగుల్లో రంధ్రాలు పడి ప్రాణానికే ప్రమాదం ఏర్పడేదని డాక్టర్ నాగూర్‌బాషా తెలిపారు. జాగ్రత్తగా గుండు సూదిని బయటకు తీసి ప్రాణాలు కాపాడిన గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యుల్ని ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్ బాబు, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ అభినందించారు. సకాలంలో స్పందించి వైద్యం చేసిన డాక్టర్లకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సురక్షిత నీటి సరఫరాయే జలజీవన్ లక్ష్యం



కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ రంగారావు

చీరాల: ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని సరఫరా చేయడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని జిల్లా కో ఆర్డినేటర్ టి.రంగారావు అన్నారు. శుక్రవారం వేటపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఇందులో టి.రంగారావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ ట్యాప్ కనెక్షన్ ద్వారా ఒక్కొక్కరికి 55 లీటర్ల వంతున తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమలు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి.తేజ్ సంగీత్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు కురుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ ఎప్రాయిం, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా



విద్యార్థులతో ఆర్మీ అధికారులు

నరసరావుపేటరూరల్: ఎన్‌సీసీలో చేరే క్యాడెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా ఉంటుందని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీలో చేరే మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. కల్నల్ సునీల్‌గౌతమ్, చీరాల ఆర్మీ యూనిట్ సుబేదార్‌లు అవతార్ సింగ్, రన్వీర్‌సింగ్, హవల్దార్లు నారాయణ జీనా, వీరేష్‌లు ఎంపికలో పాల్గొన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న 400మంది విద్యార్థులు ఎంపికలకు హాజరయ్యారు. ఆర్మీ అధికారులు వీరికి శారీరక పరీక్షలు నిర్వహించి 90 మందిని ఎంపిక చేశారు. కల్నల్ సునీల్‌గౌతమ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు డిఫెన్స్ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, బోనస్ మార్కులు కేటాయిస్తారని వివరించారు. ఎన్‌సీసీలో చేరడం వల్ల కార్పొరేట్ కంపెనీస్‌కు అవసరమైన పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సమయపాలన, టీం వర్క్, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్‌లు పాల్గొన్నారు.